## సిఓఈసిఈటి 2024కి ఈ నెల 20 వరకు దరఖాస్తు గడువు పెంపు

**మొయినాబాద్, జనవరి 16 ప్రభాతవార్త:**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల్లో ఇంటర్మీ డియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గాను నిర్వహించే సిఓఈసిఈటి 2024కి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 వరకు గడువు పెంచినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతీయ సమన్వయాధికారి డా.శారదా వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 చివరి తేదీ అయినప్పటికీ దరఖాస్తు చేసుకునే వారికి వీలుగా ఈ నెల 20వ తేదీ వరకు పొడి గించినట్లు ఆమె తెలిపారు. ఇంకా మిగిలిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురు కుల విద్యాలయాల వెబ్ సైట్ ద్వారా గానీ దగ్గరలోని మీ సేవా కేంద్రాలను గానీ సందర్శించుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రతిభా కళాశాలల్లో ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐటి, నీట్ ప్రవేశపరీక్షలకు కోచింగ్ ఇవ్వబడుతుందని వివరించారు. ప్రతి సంవత్సరం సాంఘిక సంక్షేమ గురుకులాల నుంచి వందల సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు ప్రసిద్ధ ఐఐటిలలో ప్రవేశాలు పొందు తున్నారని తెలిపారు. అలాగే ఎంబిబిఎస్‌లో కూడా ప్రవేశాలు పొందుతున్నారని డా.శారదా వెంకటేష్ ఆ ప్రకటనలో తెలిపారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# అనంతుడిని దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

**వికారాబాద్,జనవరి 16, ప్రభాతవార్త:**

అనంతగిరిలో శ్రీ అనంత పద్మనాభ స్వామిని సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. మంత్రి రాకను పురస్కరించుకుని ఆలయ అర్చకులు పూర్ణకుంభం తో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి, వేద మంత్రోశ్చరణతో ఆశీర్వచనం చేశారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆలయ అధికారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఆలయానికి సంబంధించిన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కిషన్‌రెడ్డికి ఆలయ అధికారులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షులు టి.సదానంద్‌రెడ్డి, ఆలయ ఈఓ టి.నరేందర్, ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఆలయ ప్రధాన అర్చకులు శేషగిరి పంతులు, ఆలయ అధికారులు శాంతకుమార్ తదితరులు ఉన్నారు.

## గడీల శివాలయంలో మైనంపల్లి హన్మంత్‌రావు పూజలు



తూంకుంట గ్రామ పరిధిలో ఉన్న గడీల శివాలయంను సందర్శించిన మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు,పాల్గొన్న మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్,పాల్గొన్న తదితరులు

**శామీర్‌పేట, జనవరి 16, ప్రభాతవార్త**

తూంకుంటలోని గడీల శివాలయంలో ఉన్న శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు సందర్శించి పూజలు చేశారు. మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం ఆయన ఆలయాన్ని సందర్శించి విచ్చేసి పూజలు చేశారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని గడీల శివాలయంలో ఉన్న భవాని రామలింగేశ్వరస్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు పూజారి రామకృష్ణ, బ్రహ్మణులు అంజు,ప్రణయ్,కమల్ ల నుంచి ఆశీర్వచనం ఆయన తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, నాయకులు తోట లక్ష్మీకాంత్‌రెడ్డి, టిఆర్ రవీందర్‌గౌడ్, నక్క పెంటయ్యగౌడ్, బి.సుభాష్‌యాదవ్, రంగు ప్రవీణ్‌గౌడ్, మేకల శ్రీనుముదిరాజ్, జి.ఎల్లేశ్‌యాదవ్, బి.వెంకటేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాన రహదారిపై భయం భయం

- -రెండేళ్లకే కుంగిన ప్రధాన రహదారి
- -ప్రమాదాలకు గురైతున్న వాహనదారులు
- -నిర్వహణ మరిచిన కాంట్రాక్టర్

**బంట్వారం,జనవరి 16 (ప్రభాతవార్త) :**

కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రధాన రహదారిపై ప్రయాణికులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇందుకు నాణ్యతను గాలికొదిలి కాంట్రాక్టర్ నిర్మించిన రోడ్డు రెండేళ్లకే కుంగిపోవడంతో గోతి ఏర్పడింది. దీంతో ఈ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయంలో మండల పరిధిలోని తొరుమామిడి–తాండూర్ ఆర్‌అం డ్‌బి రోడ్డు 21 కిలోమీటర్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం సుమారు 25 కోట్లను ఖర్చు చేసింది. ఈ రోడ్డును బిట్లుగా నిర్మాణ పనులు చేయడంతో ఒక్కొక్కచోట ఓ నాణ్యతగా నిర్మించారు. ఈ రోడ్డు నిర్మించి కనీసం రెండు యేండ్లు పూర్తీ కాలేదని, అప్పుడే ఇలా గోతులు పడ డం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే తొరమామిడి గ్రామంలోని ఎస్సీ కాలని వద్ద రోడ్డు కుంగి పోవ డం, రోడ్డు కుంగినచోట బైకు లపై వెళ్లే వారికి కనిపించకపోవడంతో గోతిలోకి వాహనం వెళ్ళగానే జంప్ అయ్యి ప్రమాదానికి గురవుతున్నారు. ఇంత జరిగినా సంబంధిత అధికారులు అటువైపుగా వచ్చి చూసిన పాపాన పోలేదు. దీన్ని మరమ్మత్తులు చేయాల్సిన కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో గొయ్యి మరింత పెరిగే ప్రమాదం ఉంది. అయితే గ్రామ మధ్యంలో ఉండడంతో స్థానిక ప్రజలు స్పందించి ప్ర మాదాలకు గురికాకుండా రోడ్డుపై రాళ్లతో పేర్చి, హెచ్చరిక సూచనలు చేశారు. దీంతో కొంతవరకైనా ప్రమాదాల నుండి వాహనదారులను రక్షించిన వారైతామని స్థానికులు పేర్కొంటున్నారు ఈ రోడ్డున పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఒక్కసారైనా ఇక్కడికి వచ్చిన పాపానపోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం రోడ్ల ను నిర్మిస్తున్న సమయంలో స్థానికంగా అధికారులు పర్యవేక్షించకపోవడంతోనే నాణ్యత ప్ర మాణం గాలికి వదిలి కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా రోడ్డు నిర్మిస్తున్నారని మండిపడుతున్నారు. దీంతోనే ఇలాంటి గోతులు ఏర్పడి, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని విమర్శిస్తున్నారు.

వాహన దారులకు జరిగే నష్టం ఎవరు పూడుస్తారని, ఇందుకు బాధ్యులు ఎవరని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగి నాక ఎవరు ఎంతటి నష్టాన్ని భరించి, ఆదుకునే వారు కారని ప్రజలు మండిపడుతున్నారు ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, త్వరలోనే ఆ గోతిని తొందరగా మరమ్మతులు చేసి, ప్రమాదాలను నివారించాలని వా రు కోరుతున్నారు.

### స్పీడ్ బ్రేకర్స్‌తో మరింత ఇబ్బందులు

తొరుమామిడి–తాండూర్ ప్రధాన రహదారిపై తొరుమామిడి వద్ద లెక్కకు మించి స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేశారు. గ్రామం దాటేసారికి సుమారు 14 స్పీడ్ బ్రేకర్స్‌ను అధిరారులు ఏర్పాటు చేయడంతో, వాహనాలు నడిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఉదుర్కోవాల్సి వస్తుందని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబ్బందనల మేరకు స్పీడ్ బ్రేకర్స్‌లను ఏర్పాటు చేయాలను వాహనదారులు కోరుతున్నారు. ఇదే కాక అదిక లోడ్‌తో వెళ్ళాల్సిన వాహనాలు చాలా ఇబ్బందులకు గురవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. దీనిపై అధికారులకు కనీస పరిజ్ఞానం లేకపోవడమా... అంటు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### కుంగిన రోడ్డును త్వరగా మరమత్తులు చేయాలి

**–సీహెచ్ మొగులయ్య,తొరుమామిడి గ్రామస్తుడు**

తొరుమామిడి–తాండూర్ ప్రధాన రహదారి నిర్మించి రెండు యేండ్లు పూర్తీకాలేదు. అప్పుడే కుంగి పోవడం నాణ్యత ప్రమానాలను తెలియజేస్తుంది. రోడ్డు కుంగి పోవడంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకోక ముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. అదే విదంగా నిబందనల మేరకు, అవసరమున్న చోటనె స్పీడ్ బ్రేకర్స్‌లను ఏర్పాటు చేయాలి.

# ఘనంగా క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి జాతర

- -స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



క్షేత్రగిరి గుట్టపై వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జనవరి 16, ప్రభాతవార్త :**

మేడ్చల్ మండలంలోని ఘన్‌పూర్‌లో గల క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయ జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 15 స్వామి వారి కళ్యాణం, మంగళవారం జాతర ఉత్సవాలను జరిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు, మొక్కుబడి సేవలు, సామూహిక అర్చనలు, విశేష పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా మేడ్చల్ మండల, నియోజకవర్గ, జిల్లా ప్రజలతో పాటు సమీప జిల్లాల నుండి భక్తులు తరలిరావడంతో క్షేత్రగిరి గుట్ట కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకని మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వేరువేరుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసి ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యం కొరకు మేడ్చల్ నుండి, సికింద్రాబాద్ నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. భక్తుల కొరకు మేడ్చల్ మాజీ సర్పంచ్, దివంగత నేత రాజేశ్వర్ గౌడ్ తనయుడు, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ మణికంఠ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్ యాదవ్, సుదర్శన్, నారాయణ, రఘుపతిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా గోదాదేవి అమ్మవారి స్నపన తిరుమంజనం

- -గోవింద నామస్మరణలతో మారుమ్రోగిన శ్రీవారి ఆలయం



గోదాదేవి అమ్మవారికి ప్రతే ్యక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**కొడంగల్,జనవరి 16ప్రభాతవార్త**

పేదల పెన్నిదిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న శ్రీమహలక్ష్మీ వెంకటేశ్వర దేవాలయంలో గోదాదేవి (ఆండాళ్ అమ్మవారి) స్నపన తిరుమంజనం కార్యక్రమం సోమవారం కన్నుల పండువగా కొనసాగింది. సంక్రాంతి కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు బాలాజీ,వెంకటరమణల ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారికి విశేష అలరంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బాలాజీమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం వరహస్వామి ఆలయంలో అమ్మవారికి పాలు,పెరుగు,పసుపు,చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం తదితర పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చీర,రవికలతో అమ్మవారికి చాటవైనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కాగ ఆలయంలో గతనెల 17 నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజలు ఆదివారంతో ముగిశాయి. గోదాదేవి స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామస్వామి,ధరూరీ శ్రీనివాసాచార్యులు,పురోహితులు కిట్టుస్వామి,ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్,వెంకట్‌రత్నం,ప్రశాంత్‌లతో పాటు పట్టణ ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తోంది

- -హౌసింగ్ స్కీమ్ కోసం తొలి విడుతలో రూ.540 కోట్ల నిధులు మంజూరు
- -మౌలిక సౌకర్యాలతో సొంతిళ్లు నిర్మించడమే లక్ష్యం
- -వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, జనవరి 16 ప్రభాతవార్త :**

ఆదివాసుల, గిరిజనుల అభివృద్ధికి తమ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. పీఎం జన్ మన్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్‌లోని గిరిజన హాస్టల్‌లో కడ్తాల్,ఆమనగల్ మండలాల 11 గ్రామాల చెంచులతో డిప్యూటి కమీషనర్ మినిస్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సుశీల్ ఐఏఎస్,గురుకుల సెక్రటరీ నవీన్ నికోలసమ్ ఐఏఎస్,జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ కె. శశాంక ఐఏఎస్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా చెంచులతో నిర్వహించిన సమావేశాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా దేశంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు సంక్రాంతి కానుకగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి జన జ్యోతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కింద రూరల్ హౌసింగ్ స్కీమ్ కోసం తొలి విడుత రూ.540కోట్ల నిధులను విడుదల చేశారు. దీంతో తొలి విడత కింద సుమారు లక్షమంది గ్రామీణ ప్రజలకు లబ్ధిచేకూరనుందన్నారు. ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిధులను విడుదల చేశారు. 2023 నవంబర్ 15వ తేదిన ట్రైబల్ ప్రైడ్ డే సందర్భంగా పీఎం జన్ మన్ పథకాన్ని ప్రారంభించిన కేంద్రం, బలహీన గిరిజన సమూహాల సామాజిక ఆర్థిక సంక్షేమం కోసం దాదాపు రూ.24వేలకోట్లు వెచ్చించిందన్నారు. వీటితో బలహీన ఆదివాసీ చెంచులకు సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య,వైద్యం, విద్యుత్, రహదారి, టెలికాం కనెక్టివిటి వంటి మౌళిక సదుపాయాలు కల్పించనున్నామని తెలియజేశారు. దేశంలో షెడ్యూల్డ్ తెగ జనాభా 10.15కోట్లుగా ఉందన్నారు. 18 రాష్ట్రాలు, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లో 75 ఆదివాసీ కమ్యూనిటీలు సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో వెనకబడి ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే వారి కోసం కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని 2023 , 24 బడ్జెట్‌లో 500బ్లాక్‌లు, 15000 బలహీన గిరిజన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం మొదటి 100 జిల్లాలలో తొలి విడుత ప్రాజెక్టు ప్రారంభించారని, ఇతర జిల్లాల్లో రెండో విడుత దశలో చేపట్టనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశంలోని పలు రాష్ట్రాల ఆదివాసీ కుటుంబాలతో మాట్లాడారు. ఆదివాసీ కుటుంబాలకు వ్యక్తిగత హక్కులు కాకుండా చూసుకోవడం, ప్రాథమిక మౌళిక సౌకర్యాలతో సొంతిళ్లు నిర్మించడమే లక్ష్యంగా చేసిన ప్రయత్నం అని పేర్కొన్నారు. ఆదివాసీ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూసుకోవడం కోసం తమ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. వెనకబడిన ఆదివాసీ, చెంచు కుటుంబాలకు ప్రతి సంక్షేమం పథకం చేర్చడమే పీఎం జన్ మన్ మహా అభియాన్ లక్ష్యమన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు అందుతున్నాయని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ముందర డిప్యూటి కమీషనర్, మినిష్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సుశీల్ విమల్ కాన్ఫరెన్స్ ఆవరణలో ఏర్పాటు మెడికల్ డిపార్ట్‌మెంట్ హెల్త్ క్యాంప్, జిసిసిలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. ఆదివాసులకు అందాల్సిన వైద్య సదుపాయాలను పరిశీలించడంతో పాటు వాటి ఉపయోగాల గూర్చి స్థానిక ఆశావర్కర్లను అడిగి తెలుసుకున్నారు. నరేంద్రమోడీ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డిప్యూటి కమీషనర్ మినిష్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సుశీల్ విమల్ ఐఏఎస్, గురుకుల సెక్రటరీ నవీన్ నికోలసమ్ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ కె.శశాంక ఐఏఎస్, డిఆర్‌డిఓ ప్రభాకర్‌రావు, డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి కె.రామేశ్వరిదేవి, లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ కార్డు, ఆయూష్ అభ కార్డ్స్, ఆధార్ కార్డులు, కాస్ట్ సర్టిఫికెట్లను అందజేశారు.



వైద్య సదుపాయాలను పరిశీలిస్తున్న అధికారులు.

ఈ కార్యక్రమం ముగింపుకు మందు ఆదివాసీల వైద్య సదుపాయాల కోసం మెడికల్ మొబైల్ యూనిట్, డిప్యూటి కమీషనర్ మినిష్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సుశీల్ విమల్,గురుకుల సెక్రటరీ నవీన్ నికోల సమ్, జిల్లా కలెక్టర్ శశాంక, డిఆర్‌డీవో ప్రభాకర్ రావు, డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి కె.ఈ. రామేశ్వరిదేవి, ప్రజా ప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

**వికారాబాద్,జనవరి 16, ప్రభాతవార్త:**

గుర్తు తెలియని మహిళను ధారుణంగా హత్య చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలం పులిమద్ది గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. వికారాబాద్ సీఐ టంగుటూరు శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పులిమద్ది గ్రామ శివారులో గుర్తు తెలియని మహిళ(30) శవం ఉన్నట్లు సోమవారం స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి క్లూస్ టీం, పోలీసు జాగిలాలతో వెళ్ళి పోలీసులు పరిశీలించారు. మహిళను చీర కొంగుతో మెడకు బిగించి హత్యచేసి, ఆపై తగులపెట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి ముఖం పూర్తిగా కాలిపోయి ఉండటంతో గుర్తు పట్టలేని విధంగా ఉందని, మృతురాలి ఒంటిపై ఆకు పచ్చ జాకెట్, గులాబి కలర్ పెట్టికోట్, ఆకు పచ్చ రంగు చీర ధరించి ఉందని సీఐ తెలిపారు. మృతురాలిని గుర్తు పడితే వికారాబాద్ పోలీసులను సంప్రధించాలని, 8712670030 నెం బరుకు ఫోన్ చేయాలని సీఐ సూచించారు. పులిమద్ది గ్రామ సర్పంచ్ మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని మహిళ శవం లభ్యం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టంగుటూరు శ్రీను తెలిపారు.

## గోన సంచిలో మృతదేహం లభ్యం

**ఆదిభట్ల జనవరి16,ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బ్రాహ్మణపల్లి ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో గోన సంచుల్లో డెడ్ బాడీ లభ్యమవడంతో కలకలం సృష్టించింది. సంచిలో మృతదేహాన్ని మూట కట్టి ఔటర్ రింగ్ రోడ్డు వంతెనపై నుండి కిందకి గుర్తు తెలియని వ్యక్తులు పడేసారు. మూట నుండి దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నది. కాళ్ల చేతులను తాళ్లతో బంధించిన దుండగులు నోటికి టేపు వేసి హత్య చేసినట్లు గుర్తించారు. చనిపోయిన వ్యక్తి మెడలో బంగారు గొలుసు చేతికి కడియం ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి ఉస్మానియాకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. చనిపోయిన వ్యక్తి ఎవరు అనేదానిపై ఆరా తీస్తున్నారు. మృతదేహం పురుషునిగా గుర్తించడం జరిగింది. అతనికి దాదాపు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని అంచనా వేశారు. సిసి పుటేజ్‌ల ఆధారంగా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తామని పోలీసులు తెలిపారు.

## తాడిపర్తిలో విద్యుత్ అంతరాయం

**యాచారం జనవరి16,ప్రభాతవార్త :**

విద్యుత్ మరమ్మతుల కారణంగా యాచారం మండల పరిదిలోని తాడిపర్తి గ్రామంలో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఎఈ సందీప్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాడిపర్తి గ్రామంలో 11కెవి సరఫరా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని రైతులు,వ్యాపారాలు సహకరించాలని కోరారు.

## తెలుగు లోగిళ్లలో మకర సంక్రాంతి,కనుమ పర్వదిన సందడి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, జనవరి 16 ప్రభాతవార్త :**

తెలుగువారి లోగిళ్లలో పతంగుల పండుగగా చెప్పుకునే మకర సంక్రాంతి, కనుమ పర్వదిన సందడి చోటు చేసుకుంది. ప్రతి ఒక్కరి ఇళ్లలో సుఖశాంతులు,భోగభాగ్యాలు ప్రసాదించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ... ప్రతిఏటా జనవరి మాసంలో వచ్చే మకర సంక్రాంతి పర్వదినం ప్రతి తెలుగు వారిళ్లలో పతంగుల పండుగగా పిలుచుకుంటారన్నారు. వ్యవసాయ పంటలు ఇంటికి చేరడమే గాక ఆ కుటుంబాలన్నీ భోగభాగ్యాలతో తులతూగాలనే ఉద్దేశంతో మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలను జరుపుకోవడం జరుగుతుందని, ఈ పర్వదినాలను ప్రతి కుటుంబ సుహృద్భావ వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా తెలుగు వారందరికీ ఆమఎ మకర సంక్రాంతి,కనుమ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఉత్సాహంగా జరుపుకున్న పతంగుల పండుగ



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో 14వ వార్డులో పతంగులు ఎగురవేసిన దృశ్యం

**శంకర్‌పల్లి, జనవరి 16 ప్రభాతవార్త:**

శంకర్‌పల్లి పట్టణ పరిధిలో గత మూడు రోజులుగా సంక్రాంతి పండుగలో భాగంగా పతంగుల పండుగను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎక్కడికక్కడ స్నేహితులు, బంధువులతో కలిసి రంగు రంగుల పతంగులు ఎగురవేసి పండుగను ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ఖాళీమైదానాలు, ఎత్తయిన భవంతులు, పాఠశాల మైదానాల్లో పతంగులను ఎగురవేశారు. ఒకొరికొరు పోటీపడుతు పతంగులను ఎగురవేశారు. శంకర్‌పల్లిలోని 14వ వార్డులో, శం కర్‌పల్లిలో పెద్ద ఎత్తున పతంగులు ఎగురవేశారు.



శంకర్‌పల్లిలో పతంగులతో ఆడుకునేందుకు చేరిన గ్రామస్తులు

## దేశాన్ని రక్షించడానికి దైవదూతలు లాంటి వాళ్లు సైనికులు



కల్నల్ లంకా శ్రీనివాస్‌ను దంపతులను ఘనంగా సత్కరిస్తున్న పూర్వ సభాపతి సిరికొండ మధుసూధనాచారి

**ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి**

బేగంపేట జనవరి 16, ప్రభాతవార్త : దేశాన్ని రక్షించడానికి దేవుడు నియమించిన దైవదూతలు సైనికులు అని తెలంగాణా పూర్వ సభాపతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి అన్నారు. సోమవారం బేగంపేట కుందన్‌బాగ్‌లో ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో ,జాతీయ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత సైన్యంలో కల్నల్‌గా విశిష్ట సేవలు అందించి సేవా మెడల్ అందుకున్న లంకా శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మధుసూధనా చారి కవి కాళోజీ ,పుట్టుక నీది. చావునీది. బతుకు దేశానిది అన్న కవితా పంక్తులను ఉదహరించారు. ఈనాటి యువత సైన్యంలో పనిచేయడానికి చొరవ చూపాలన్నారు. విభిన్న,ప్రతికూల పరిస్థితుల్లో సైన్యం దేశ రక్షణలో అనుక్షణం అప్రమత్తతతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు,ఆకృతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విఎస్టీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు



వి.శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించిన దృశ్యం

**యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి**

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: విఎస్టీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా తాను పనిచేస్తానని యూనియన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. విఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవంతంగా వివిధ యూనియన్‌లకు అధ్యక్షులుగా ఎన్నికవుతూ వస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, యూనియన్ నాయకులు బాబీ, రవియాదవ్, నరేందర్‌గౌడ్, రణధీర్‌రెడ్డి, మధు, సత్యనారాయణ, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విఎస్టీ కార్మికులకు చారిత్రాత్మకమైన అగ్రిమెంట్ చేసి మంచి వేతనాన్ని అందించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అంతకుముందు వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు విఎస్ఆర్ నిర్వహించారు.

## ఎన్టీఆర్‌కు నివాళులర్పించి.. స్మరించుకుందాం

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్**

ముషీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త: ఈనెల 18వ తేదీ గురువారం స్వర్గీయ ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకుందామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి రోజు ఉదయం 9గంటలకు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి కార్యక్రమం ఉంటుందని, 9.30 నిమిషాలకు రసూల్‌పురా వద్ద ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలి, 10 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో నివాళి, 10.30 నిమిషాలకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని అశోక్‌నగర్ చౌరస్తాలో నివాళి కార్యక్రమం, అనంతరం జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నగరంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు.

### హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్టుకు

## జైపాల్‌రెడ్డి చేసిన సహకారం ఎంతో ఉంది

**హెచ్‌ఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి**

హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త : ప్రతిష్టాత్మకంగా చేపట్టి పూర్తి చేసిన హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్టుకు నిధులు, ఇతర అనుమతులు రావడంలో మాజీ కేంద్ర మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని హెచ్‌ఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం నెక్లెస్‌రోడ్స్‌లోని స్ఫూర్తిస్థల్ వద్ద మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. హైదరాబాద్ మెట్రోరైల్వే ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేయడంతో కీలకపాత్ర పోషించారని, ముఖ్యంగా వయబిలిటీ గ్యాప్‌ఫండింగ్ ఆమోదం వంటి కీలకమైన అనుమతులు రావడంతో ఆయన విశేషంగా కృషి చేశారన్నారు. ఒక సందర్భంలో స్టాండర్డ్ గేజ్(4‘8)ను అనుసరించాలనే మెట్రోరైల్ కార్పొరేషన్‌ల ప్రతిపాదనను భారతీయ రైల్వే శాఖ వ్యతిరేకించడం, అనంతరం బ్రాడ్‌గేజ్(5‘6)ను స్వీకరించాలని పట్టుబట్టడం, మొదట్లో ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగళూరు మెట్రో ప్రాజెక్టులు ‘గేజ్’ సమస్యలపై నిలిచిపోయాయని తెలిపారు. ఇటువంటి క్లిష్ట సమయంలో ఆ సమయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ఎస్.జైపాల్‌రెడ్డి ఏ విధంగా అప్పటి కేంద్ర మంత్రుల బృందానికి నాయకత్వం వహించిన శరద్‌పవార్, పి.చిదంబరం, లాలూప్రసాద్‌యాదవ్‌లకు నమ్మకమైన ప్రజెంటేషన్ చేయడానికి తనకు ఎస్.జైపాల్‌రెడ్డి మార్గదర్శనం చేశారని అన్నారు. మెట్రో ప్రాజెక్టులకు స్టాండర్డ్ గేజ్ అవసరం గురించి సరైన వివరించడం మూలంగా చివరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇటువంటి అంశాలపై ఆ సమయంలో కేంద్ర మంత్రిగా ఉన్న ఎస్.జైపాల్‌రరెడ్డి బలమైన మద్దతు వల్లే హైదరాబాద్ మెట్రో నేడు దేశంలోని అన్ని ఇతర మెట్రోరైల్ ప్రాజెక్టులను ఫలవంతం చేయడానికి పునాది వేసిందని డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి వివరించారు.

## జయ శంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య : కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్




జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 16, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తట్టిలేపిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహాన్ని ఒక గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేయడం విచారకరమన్నారు. మద్యం మత్తులో ఊగుతూ, పిచ్చి పిచ్చి గెంతులు వేస్తూ, పెద్ద బండరాయితో జయశంకర్ విగ్రహాన్ని పగలగొట్టి పైశాచిక ఆనందం పొందడాని పేర్కొన్నారు. ఈ విషాదకరమైన సంఘటనను ఖండిస్తూ డివిజన్ కార్పొరేటర్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నర ఏళ్ళ పాలనలో చిన్న చిన్న పొరపాట్లు కూడా జరగకుండా జాగ్రత్త పడ్డామని, విగ్రహాన్ని పగలగొట్టిన వ్యక్తి ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో పార్టీలకు అతీతంగా మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, ఎన్టిఆర్ వంటి ఎంతోమంది మహానుభావుల విగ్రహాలను ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ప్రతిష్టించడం జరిగిందని గుర్తు చేశారు. పోలీస్ శాఖ వారు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పారదర్శకంగా దర్యాప్తు చేసి నిందితున్ని విచారించి శిక్షించాలని డిమాండ్ చేస్తూ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అనందోత్సవాల మధ్య సంక్రాంత్రి

అఫ్జల్‌గంజ్, జనవరి 16ప్రభాతవార్త: సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్స వాల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావు గుప్త అన్నారు. పండుగను పురస్కరిం చుకుని డివి జన్ పరిధిలోని చిన్నారులు, కుటుంబ సభ్యులతో కలిసి గుప్త గాలిపటాలను ఎగురవేశారు.





## అయ్యప్పస్వామి దర్శించుకున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

కంటోన్మెంట్, జనవరి 16 ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లో బొల్లారం అయ్యప్పస్వామి వారిని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యాక్రమంలో ఆలయ మేనేజర్ రంజన్, ట్రెజరర్ పద్మనాభ నంబియార్, సుబ్రహ్మణ్యస్వామి టెంపుల్ మారేడ్‌పల్లి ట్రస్టీ బోర్డు బోర్డు మెంబర్ చోళ్ళేటి రమేష్, చీకోటీ ప్రదీప్, శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు గాలిపటాల పంపిణీ



కంటోన్మెంట్, జనవరి 16 ప్రభాతవార్త: సంక్రాంతి పడుగను పురస్కరించుకొని పల్లవి విద్యా సంస్థల పరిపాలన అధికారి మల్క యశ్వి ఈస్ట్ మారేడ్‌పల్లి అంబేద్కర్‌నగర్‌లో బస్తీ నాయకులు చిన్న వీరయ్య, బాబు యాదవ్‌ల ఆధ్వర్యంలో పిల్లలకు గాలిపటాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బీజేపీ నేతలు శ్రీగణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హుండి లెక్కింపు

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం హుండి లెక్కింపు బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆలయంలో జరుగుతుంది. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని, ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చని వివరించారు.

## ఎమ్మెల్యే గాంధీకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 16, ప్రభాతవార్త : సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి నియోజకవర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే గాంధీ నివాసంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కారించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.డి.యూసఫ్

సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి నూతన ప్రభుత్వం చొరవ చూపాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ కోరారు. ఈ మేరకు మంగళవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల 769 గ్రామ పంచాయతీలలో 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారి వారి సమస్యలు పరిష్కారించాలని గత ప్రభుత్వ హయంలో అనేక పోరాటాలు నిర్వహించినా పట్టించుకోలేదని ఆరోపించారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టి.నరసింహారెడ్డి, జయచంద్ర, బి.వెంకట్, రాజాం, మల్లయ్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యం

జీడిమెట్ల, జనవరి 16, ప్రభాతవార్త: రోడ్డు ప్రక్కన ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి బహదూర్‌పల్లి సమీపంలోని పాలకేంద్రం వద్ద రోడ్డు ప్రక్కన యువకుడి మృతదేహం ఉంది. స్థానికుల సమాచారంతో దుండిగల్ సీఐ సిహెచ్ శంకరయ్య సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సిఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం యువకుడి వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందన్నారు. రోడ్డు ప్రక్కన నడుచుకుంటూ వెళ్తుంటే వాహనం ఢీకొని ఉండవచ్చన్నారు. తలకు, కాళ్ళకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. స్థానికులు తెలిపిన ప్రకారం స్థానికంగా ఉండే ఓ హోటల్‌లో టీ తాగి వెళ్ళినట్లు సమాచారం. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుండిగల్ సీఐ సిహెచ్ శంకరయ్య తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దేవాలయాలపై ప్రభుత్వాలు పెత్తనం విరమించుకోవాలి



ఖత్రాలోని శ్రీవైష్ణవి దేవాలయం ఎదుట ప్రదర్శన చేస్తున్న కార్యకర్తలు

సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పెత్తనం నిరోధించాలని డిమాండ్ చేస్తూ ఏకం సనాతన్ భారత్ దళ్ కార్యకర్తలు జమ్ములోని ఖత్రాలోగల మాతా శ్రీవైష్ణవిదేవి అమ్మవారి ఆలయం ఎదుట భారీగా ప్రదర్శన నిర్వహించారు. దళ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేంద్రకుమార్ చతుర్వేది మాట్లాడుతూ ఖత్రాలోని హిందూ దేవాలయా లు, పుణ్య క్షేత్రాలపై ప్రభుత్వం పెత్తనం చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. మజీదులను ముస్లింలు, చర్చిలను క్రైస్తవులు, గురుద్వారాలను సిక్కులు నడిపిస్తున్నారని, కాని హిందూ దేవాలయాలపై ప్రభుత్వాల పెత్తనం ఎందుకని ఆయన ప్రశ్నించారు. హిందూ ధార్మిక ఆధ్మాతిక సంస్థలను ప్రభుత్వాలు కేవలం వాణిజ్య కేంద్రాల కే పరిమితం చేశాయని, భక్తుల డబ్బులతో ఇతరా కార్యక్రమాలకు ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయని ఆరోపించారు. శ్రీవైష్ణవదేవి ఆలయాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా పూజలు నిర్వహిస్తున్న వారికే ఆలయ నిర్వహణ బాధ్యతలను అప్పగించాలన్నారు. ఇతరులకు ప్రభుత్వం అప్పగించరాదని, ప్రభుత్వం తన పెత్తనాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీవైష్ణవి దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దళ్ జాతీయ అధ్యక్షుడు అంకుర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి శ్రీవారి దేవాలయంలో ఘనంగా గోదాదేవి అమ్మవారి కల్యాణం




సైఫాబాద్, జనవరి 16 ప్రభాతవార్త: ధనుర్మాసంను పురస్కరించుకుని మంగళవారం ఉదయం లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం (తిరు నియలం)లో గోదాదేవి అమ్మవారు-రంగనాయకుల స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఉదయం 10 గంటలకు ముందే వేలాది మంది భక్తులు కళ్యాణ మహోత్సవానికి హాజరైనారు. వేద పండితుల మత్రోచ్ఛరణలు వల్లిస్తుండగా సన్నయి మేళాలు మ్రోగుతుండగా అమ్మవారి కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జంట నగరాల నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బంది దేవాలయాన్ని పూల మాలలతో అందంగా అలంకరించారు. విద్యుత్ దీపాల ఏర్పాట్లుతో దేవాలయం మిరమిట్లు గోలిపే విద్యుత్ కాంతులతో ధగ, ధగ మెరిసిపోయింది. కళ్యాణం అనంతరం భక్తులకు సిబ్బంది రకరకాల ప్రసాదాల వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో టిటిడి హైదరాబాద్ లోకల్ అడ్వయిజరి కమిటి అధ్యక్షుడు ప్రసాద్, టిటిడి డిప్యూటి ఎఈవో రమేష్‌బాబు, సిబ్బంది భక్తులు సేవలు అందించారు.

**వైభవోపేతంగా గోదాఅమ్మవారి కరినోము ఉత్సవం**

**చిక్కడపల్లి..** చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస వైకుంఠ ఏకాదశి మహోత్సవాలలో భాగంగా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గోదాఅమ్మవారి కరినోము ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. కాగా సోమవారం మకర సంక్రమణ పర్వదినోత్సవం సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## పెండింగు సమస్యలను పరిష్కరించాలి



రహ్మత్‌నగర్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డిని కలిసిన డివిజన్ మాజీ అధ్యక్షులు ఎక్బాల్

యూసుఫ్‌గూడ, జనవరి 16, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహ్మత్ నగర్ డివిజన్‌లో బస్తీల కాలనీలలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరించేందుకు తగిన విధంగా కృషి చేయడం జరుగుతుందని డివిజన్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా మంగళవారం డివిజన్ మాజీ అధ్యక్షులు ఎక్బాల్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ సిఎన్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. అనంతరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ తీగలపై ఉన్న గాలి పటం తీయటానికి ప్రయత్నించిన బాలుడు మృతి



మృతి చెందిన బాలుడు దోర్నాల లక్ష్మీ వివేక్

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 16 ప్రభాతవార్త : విద్యుత్ తీగలపై ఉన్న గాలి పటాన్ని తీయటానికి ప్రయత్నించిన పదమూడేళ్ల బాలుడు ప్రమాదవ శాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందిన సంఘటన మంగళవారం మైలార్ దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రజాక్ కథనం ప్రకారం.. కాటేదన్ లోని గణేష్ నగర్‌కు చెందిన సంతోష్ కుమార్‌కు ఫోటో స్టూడియో ఉంది. సంతోష్ కుమార్ పెద్ద కొడుకైన దోర్నాల లక్ష్మీ వివేక్ (13) స్థానికంగా ఉన్న రవి బ్రిలియంట్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుచున్నాడు. మంగళవారం సాయంత్రం లక్ష్మీ వివేక్ భవనం మీదకు ఎక్కాడు. విద్యుత్ వైర్లకు ఉన్న గాలి పటాన్ని ఇనుప రాడ్‌తో తీయటానికి ప్రయత్నించాడు. ప్రమాదవ శాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావటంతో వివేక్ తీవ్ర గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు గాయాల పాలైన లక్ష్మీ వివేక్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వివేక్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గగన్ పహాడ్ ఎడిఇ ఈశ్వర్ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ నెల 12వ తేదీ శు క్రవారం సాయంత్రం కిషన్‌బాగ్ రహదారిలోని మల్లయ్య టవర్స్ ఎదురుగా ఉన్న లక్ష్మీ వాణి టవర్స్ ప్రాం తానికి చెందిన తనిష్క్ (11) అనే బాలుడు గాలి పటం ఎగురు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ ్వటంతో అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ కేసును అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### వివిధ రంగాల్లో నిష్ణాతులకు

## జాతీయ సేవారత్న, నంది అవార్డులు

రవీంద్రభారతి, జనవరి 16 ప్రభాతవార్త : వివిధరంగాల్లో, సంస్థల్లో పనిచేస్తున్న, ప్రాముఖ్యత కలిగిన నిష్ణాతులకు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27 శనివారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవోపేతంగా జరుపనున్న కార్యక్రమంలో నంది, జాతీయ సేవారత్న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. ఎస్.సరోజనమ్మ మీడియాకు తెలిపారు. అవార్డులు అందుకునే వారిలో ప్రముఖంగా కవులు, కళాకారులు, సంఘసంస్కర్తలు, సినీ, టీవి కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, స్టేజి ఆర్టిస్టులు, గాయనీగాయకులు, సంగీత నృత్య కళాకారులు, డాక్టర్లు, న్యాయవాద, ఫ్యాషన్ డిజైనర్లు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రముఖులున్నారని, ఈ కార్యక్రమానికి విచ్చేయనున్న ప్రముఖులైన అతిథుల చేతులమీదుగా ఆయా అవార్డులను, ఆయా రంగాల నిష్ణాతులను ఘనంగా సత్కరించి ప్రదానం చేయడం జరుగుతుందని సరోజనమ్మ వివరించారు.

## నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్,జనవరి 16 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు జూపార్కు క్వార్టర్స్,చిరాగ్ అలీ నగర్,బహదూర్‌పుర,12 నుంచి 2 గంటలు వరకు పురానాపూల్,బహదూర్‌పుర,బహదూర్‌పుర కాలనీ,మెట్రో థియేటర్,3 నుంచి 5 వరకు జూపార్కు,జూ క్వార్టర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చార్మినార్ ఎడిఇ మహ్మద్ అఫ్జల్ తెలిపారు.10 నుంచి 12 గంటలు వరకు షష్మా,వట్టెపల్లి,పరదాగేట్,మిస్కిన్ హోటల్,అల్‌మదీనా,హోటల్ బస్తీలలో,12 నుంచి 2 వరకు ఫలక్‌నుమా,మదీనా కాలనీ,రైతు బజార్,బస్ డిపో,ఇంజన్ బౌలి,జహానుమా,చార్‌చమన్,3 నుంచి 7 గంటలు వరకు వట్టెపల్లి,ముస్తాఫానగర్,నైస్‌ల్,గుంతల్‌షా దర్గా,మహమ్మదీయ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫర ఉండదని ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

## వైభవంగా సంక్రాంతి వేడుకలు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ బెంగాలీ సమితి ప్రతినిధులు

చార్మినార్,జనవరి 16 ప్రభాతవార్త : పాతబస్తీలోని పలు ప్రాంతాలలో సం క్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సంక్రాంతి సందర్భంగా ప్రజలు తమ ఇండ్లను అందంగా అలంకరించారు. ప్రజలు పూజలు నిర్వహించి ఎంతో ప్రీతితో పిండి వంటకాలను ఆరగించారు.కొత్త బట్టలు ధరించి పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.కాగా తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో ఘాన్సీ బజార్‌లో ఘనంగా పతంగుల వేడుకలు జరిగాయి.సమితి ప్రతినిధులు,బెంగాలీలు ఎంతో ఉత్సా హంతో గాలి పటాలు ఎగురు వేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి ప్రతినిధులు దీపాంకర్ పాల్,మందిరా నస్కర్,బబ్లూ,నవీన్,దేబ్‌జీత్,సుమతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బిఎస్‌పి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న బిఎస్‌పి హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు చాట్ల చిరంజీవి,కోశాధికారి మూల రామ్ చరణ్ దాస్,నాయకులు

చార్మినార్,జనవరి 16 ప్రభాతవార్త : హైదరాబాద్ జిల్లా బిఎస్‌పి కోశాధికారి,చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మూల రామ్ చరణ్ దాస్ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాతబస్తీ లలితాబాగ్ రోడ్‌లో పాతనగర బహుజన సమాజ్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.జిల్లా బిఎస్‌పి అధ్యక్షులు చాట్లా చిరంజీవి మాట్లాడుతూ పాతబస్తీలో బిఎస్‌పి పార్టీని బలోపేతం చేయటానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బంగారి మాణిక్ రావు,తోటకడి రమేష్, మనిబాబు,జగదీష్ పాల్గొన్నారు.

### అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సన్మానం

చిక్కడపల్లి, జనవరి 16 ప్రభాతవార్త: అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సంఘం(ఇట్‌క్లా) అధినేత డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో సుప్రసిద్ధ సినీ రచయిత, దర్శకుడు, తెలుగు సినీ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణకు ‘ఇట్‌క్లా ఫాస్ సంక్రాంతి సినీ పురస్కారం’ను అందించే కార్యక్రమం జరిగింది. శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను వివిధ రంగాలకు చెందిన వారికి అందించారు.

## ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ వేగవంతమయ్యేలా చొరవ చూపాలి

**-మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనంద్**




కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**పెద్దేముల్, జనవరి 16, ప్రభాతవార్త:**
ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ వేగవంతమయ్యేలా చొరవ చూపాలని మహాజన సోషలిస్టు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పి,ఆనంద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పెద్దేముల్ మండలం చైతన్యనగర్‌లో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మాత్యులు జి,కిషన్‌రెడ్డికి జిల్లా ప్రదాన కార్యదర్శి స్వామిదాసు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో వివిధ ఉద్యోగ అవకాశాలు, ఉపాధి సంక్షేమ పథకాలు వివిద రకాలుగా మాదిగ ఉపకులాలకు రావాలసిన వాటా దక్కాలంటే ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ తప్పనిసరిగా చేసిన తరువాత ఆదిశగా ముందుకు వెళ్ళాలని, దాని వల్లనే మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. రాబోయె రెండు, మూడు నెలల్లో దేశం మొత్తం ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా కొత్త ప్రభుత్వం కొలువు దీరకముందే ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ జరగాలని, దానిపై ఒత్తిడి తెచ్చె విధంగా కేంద్రమంత్రికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యంఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్ మాదిగ, కార్యదర్శి అంజి మాదిగ, జానీ మాదిగ, విద్యార్థి నాయకుడు సదానందం తదితరులు పాల్గొన్నారు.

## గంగసారం మాణెమ్మను పరామర్శించిన జడ్పిచైర్‌పర్సన్



మాణెమ్మను పరామర్శిస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్

**పెద్దేముల్, జనవరి 16, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన గంగసారం మాణెమ్మను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునితామహేందర్‌రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ యువనాయకుడైన గంగసారం హర్షవర్ధన్‌రెడ్డి నాయనమ్మ అగు గంగసారం మాణెమ్మ కాలు తుంటి విరిగిన విషయాన్ని తెలుసుకున్న జడ్‌పి చైర్‌పర్సన్ సునితా మహేందర్‌రెడ్డి పరామర్శించి ఆమే బాగోగులు తెలుసుకున్నారు. జడ్‌పి చైర్‌పర్సన్ వెంట మాజీ మండల అధ్యక్షులు ఎస్.నారాయన్‌రెడ్డి, యువనాయకుడు రుద్రారం మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, రాధక్రిష్ణ రెడ్డి,మార్కెట్ కమిటి మాజీ వైస్‌చైర్మెన్ జితేందర్‌రెడ్డి,కోహీర్ రవి, ఉప్పరి మల్లేశం,మాజీ యంపిటిసి విద్యాసాగర్, మైపూస్, రాజవర్ధన్‌రెడ్డి, పీటర్ యాదప్ప తదితరులు ఉన్నారు. అనంతరం సాయిని నారాయన్‌రెడ్డి నివాసంలో జడ్‌పి చైర్‌పర్సన్‌ను ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు.

## ఫలించిన మనోహరన్న కృషి


**-తాండూరులో మూడు ఆధార్ సెంటర్లు ప్రారంభం**

**-మాటలు కాదు పనులు చేసి చూపించి**

**ప్రజల హృదయాలను కొల్లగొట్టిన ఎమ్మెల్యే**

**పెద్దేముల్, జనవరి 16, ప్రభాతవార్త:** ప్రజలకు అనుగుణంగా ఆధార్ సెంటర్లు లేక జనం కష్టాలు పడుతుండటంతో ఎన్నికలలో ఇచ్చిన హామిని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అమలు పరిచారు. అందుకు అనుగుణంగా మంగళవారం నుంచి తాండూరులో మూడు ఆధార్ కేంద్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెలలోపే నూతన ఆదార్ సెంటర్ల ఏర్పాటుకు కృషిచేయడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మాటలు కాదు పనులు చేసి చూపించి ప్రజల హృదయాలలో ఎమ్మెల్యే సుస్థిర స్థానం సంపాదించుకున్నారని పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. గతంలో పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా కష్టాలు పడ్డారు. ప్రజల కష్టాలను దూరం చేసేందుకు ఎమ్మెల్యే చొరవ చూపి ఆధార్ సెంటర్లు ప్రారంభించడంతో పలువురు అభినందనలు తెలిపారు. తాండూరు అభివృద్ధి మనోహరన్నతోనే సాధ్యమని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తాండూరు పట్టణంలోని పాత మునిసిపల్ భవనంలో ఏర్పాటు చేసిన ఆదార్ కేంద్రాలను ప్రజలు సద్వినీయోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలకు అణుగుణంగా ఆదార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు.

## తుమ్మాలోనిగూడలో ఫ్రెండ్స్ యూత్ వాలీబాల్ టోర్నమెంట్




బహుమతులు అందజేస్తున్న గోరటి గణేష్

**యాచారం జనవరి16,ప్రభాతవార్త :**
యువతి,యువకులు క్రీడాల్లో రంగంలో రాణించాలని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.మంగళవారం యాచారం మండల పరిధిలోని తమ్మాలోనిగూడ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు.పోటిలో గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.5వేలును గోరటి గణేశ్ బహుకరించారు.కార్యక్రమంలో సంతోష్ మల్లేష్,ఉప సర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి, రాంరెడ్డి,బాలరాజ్,గ్రామస్థులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**శంకర్‌పల్లి, జనవరి 16 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదానికి గుర్రైన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత మూడు రోజుల కిందట మియాఖాన్ గడ్డ దగ్గర వాహనంపై నుంచి రోడ్డు మీద పడడంతో తలకి తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతని వయస్సు సుమారు 55 నుంచి 65 సంవత్సరాలు ఉంటాయి. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఇతను కోల ముఖం, చామన చాయ రంగు, తెల్లగడ్డం , మీసాలు కలిగి ఉండి పచ్చ రంగు చొక్కా, బులుగు రంగు బనియన్,కాఫీ రంగుతో తెల్లటి రంగు డిజైన్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుడిచేతిమీద బాల స్వామి అని పచ్చబొట్టుతో రాసి ఉంది. ఈ వివరాలను బటిన్ట ఎవరైనా గుర్తిస్తే అటువంటి వారు మోకిల పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.



మాల సోమవారం గ్రామంలో తమ ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న ప్రజలు



గాజీపూర్‌లో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మాజీ ఎంపిటిసి



సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్ళముందు ముగ్గులు వేస్తున్న మహిళలు



ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న చిన్నారి

# ఘనంగా సంక్రాంతి పండుగ

**బంట్వారం మండలంలో..**

**బంట్వారం,జనవరి 16 (ప్రభాతవార్త) :** మండల కేంద్రంతో పాటు, తోరుమామిడి బస్వాపూర్, బొపునారం, రొంపల్లి, యాచారం మాలసోమవారం తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. రైతులు తాము పండించిన దాన్యం, రకరకాల ధాన్యాలతో అలంకరించుకొని పండగ ు జరుపుకున్నారు. ఇళ్ళ ముందు రంగు రంగుల ముగ్గులు వేసి అందంగా ముస్తాబు చేసుకున్నారు. సోమవారం భోగి, మంగళవారం సంక్రాంతి, బుధ వారం క నుమను ప్రజలు తమ ఇళ్లలో పిండి వంటలు పండుకొని ఆస్వాదించారు. న ూతన వస్త్రాలు ధరించి, సాంభరాల ు జరుపుకున్నారు.

**పెద్దేముల్ మండలంలో ..**

**పెద్దేముల్, జనవరి 16, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాలలో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా ఇంటి ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను ఉంచారు. యువకులు , పిల్లలు కేరింతలు కొడుతు గాలిపటాలు ఎగురవేసారు,గంగిరెద్దుల వారు గంగిరెద్దులను ఆడిస్తు బిక్షాటన చేశారు. హరిదాసులు తమ సంకీర్తనలతో అలరించారు. కొత్త బట్టలు ధరించి పిండివంటలు ఆరగించారు. ధాన్య రాశులతో ఇళ్ళన్ని కళకళలాడుతు కనిపించాయి. పెద్దేముల్ మండలంలోని గాజీపూర్‌లో అంగన్‌వాడి టీచర్ జహంగీర్ బేగం మాజీ యంపిటిసి స్వర్ణలతతో కలిసి ముగ్గులు వేసారు.

**కొడంగల్ మండలంలో...**

**కొడంగల్,జనవరి 16ప్రభాతవార్త :** సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..సరదాలు తెచ్చిందే తుమ్మెదా...అంటు గ్రామాల్లోని ప్రజలు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు,యువకులు సోమవారం ఉదయం వేళల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మహిళలు సాంప్రదాయబద్దంగా ఇళ్ళముందు రంగురంగుల ముగ్గులతో అలంకరించారు.ఇళ్ళముందు వేసిన ముగ్గుల మద్యలో గొబ్బెమ్మలను ఉంచి రేగిపండు,జోన్న,శనిగలు తదితర వాటిని ఉంచారు.పట్టణంలోని బాలాజీనగర్,ఆర్యనగర్, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో వేసిన ముగ్గులు బాగా ఆకట్టుకున్నాయి.యువకులు,చిన్నారులు గాలిపటాలను ఆకాశంలోకి ఎగురవేస్తు పోటీల్లో పాల్గొన్నారు.

**సంక్రాంతి ప్రత్యేక వంటకాలుః**

వ్యవసాయ పంటలు చేతికి వచ్చే సమయంలో జరుపుకునే సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక వంటకాలను తయారుచేసి బంధుమిత్రులను కలుసుకున్నారు.నువ్వుల రొట్టేలతో ప్రారంభమైయ్యే సంక్రాంతిని మూడు రోజుల పాటు ప్రజలు ఆనందోత్స వాల మద్య జరుపుకున్నారు.సంక్రాంతి పండుగకు ప్రజలు పట్టణాల నుంచి గ్రామాలకు తరలిరావడంతో ఆర్టీసి బస్టాండ్‌లో ప్రయాణికులతో కిటకిటలాడాయి.

**కొడంగల్ మండల పరిధిలోః**

కొడంగల్ పట్టణంతో పాటు మండల పరిధిలోని హస్నాబాద్,రుద్రారం,అంగడిరాయిచూర్,రావులపల్లి,పెద్దనందిగావ ు తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్స వాల మద్య జరుపుకున్నారు.మహిళలు తమ ఇళ్ళ వాకిళ్ళలో రంగురంగుల ముగ్గులతో ఆకట్టుకున్నారు.యువకులు ఆకాశంలోకి గాలిపటాలను ఎగురవేస్తు కేరింతలతో గాలిపటాల పోటీల్లో పాల్గొన్నారు.

**జిల్లెడు చౌదరిగూడ మండలంలో**

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 16,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నుంచి సంక్రాంతి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బోగి, సోమవారం సంక్రాంతి, మండళవారం కనుమ పండులను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రజలు పిండి వంటలు, స్వీట్లు, విందు బోజనాలు చేసుకున్నారు. సమీపంలో గల దేవాలయాలకు వెల్లి మొక్కలు తీర్చుకున్నారు. తమ కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుళ్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో రాష్ట్రసాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

**-మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం**

**-గెలుపు ఓటములను సూర్తిగా తీసుకోవాలి**

**-సీఐ రాములు,టీపీసీసీ సభ్యులు ఎండీ.యూసుఫ్**



రాష్ట్రస్దాయి కబడ్డీ పోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న సీఐ రాములు



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

**కొడంగల్,జనవరి 16ప్రభాతవార్త**
కొడంగల్ పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో సోమవారం నుంచి రాష్ట్ర స్దాయి కబ డ్డీ పోటీలు ప్రారంభం అయ్యాయి.యువజన కాంగ్రేస్ అద్వర్యంలో కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు.యువజన కాంగ్రేస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణం రాజు, తాలూకా అద్యక్షులు రెడ్డిశ్రీనివాస్‌లతో పాటు యువజన కాంగ్రేస్ నాయకులు పర్యవేక్షణలో కబడ్డీ పోటీలను స్దానిక సీఐ రాములు,టీపీసీసీ సభ్యులు ఎండీ.యుసుఫ్, పీఏసీఎస్ అద్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త, కాంగ్రేస్ మండల అద్యక్షులు నందారం ప్రశాంత్,సర్పంచ్‌లు రమేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి,మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, మిఠాయి రాజులు ప్రారంబించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతు యువతకు క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుణ్యానికి ఎంతో దోహదపడుతా యన్నారు.క్రీడల్లో గెలుపు ఓటములను సూర్తిగా తీసుకోవాలని ఓటమి చెందిన వారు నిరుత్సాహం చెందకుండా విజయానికి కృషి చేయాలన్నారు. మారుతున్న కాలంలో యువత సెల్‌ఫోన్‌లలోనే ఆటలు అడుతున్నారని, ఇలాంటి గ్రామీణ ప్రాంత క్రీడలను యువజన కాం గ్రేస్ ప్రోత్సహించడం హర్షించదగ్గ విషయమన్నారు.ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు కబడ్డీ ఆడి క్రీడాకారులకు మద్దతు తెలిపారు.కబడ్డీ పోటీల ప్రాంగణంలో సీఐ రాములు,ఎస్సై భరత్‌రెడ్డిలు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.కొడంగల్ నియోజకర్గంలోని పలు మండలాలతో పాటు పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.సోమ,మంగళవారం రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు.విజేతలకు యువజన కాంగ్రేస్ ఆద్వర్యంలో బుధవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు యువజన కాంగ్రే స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు.బుధవారం జరిగే కార్యక్ర మానికి ముఖ్య మంత్రి సోదరుడు కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుప తిరెడ్డి,మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి,ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్,మున్సిపల్ చేర్మేన్ జగదీశ్వర్‌రెడ్డిలను ఆహా ్వనిస్తున్నట్లు తెలిపారు.

## గ్రామాల్లో కొనసాగుతున్న శ్రీరాముని అక్షింతల పంపిణీ



శామీర్‌పేటలో శ్రీరాముని అక్షింతల పంపిణీ ఇంటింటా కొనసాగుతున్న దృశ్యం

**శామీర్‌పేట, జనవరి 16,ప్రభాతవార్త**
అయోధ్యలోని శ్రీరామమందిరంలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముని పునఃప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్నందున దేశవ్యాప్తంగ శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఇందులో భాగంగ శామీర్‌పేటలో గత వారం రోజుల నుంచి ఇంటింటా అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శ్రీరాముని అక్షింతలు ఇళ్లకు వస్తున్నందున గ్రామాల్లో ప్రజలు ఇళ్ల వద్ద స్వాగతం పలుకుతూ అక్షింతలను తీసుకుంటున్నారు. శ్రీరాముని పలువురు సేవకులు ఇంటింటా పర్యటించి శ్రీరాముని అక్షింతలను అందజేస్తున్నారు. శ్రీరాముని అక్షింతల ప్రాధాన్యత, పూజా కార్యక్రమాలను వివరిస్తున్నారు. గ్రామాల్లో జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ భక్తిపావశ్యంను వ్యాపింపజేస్తున్నారు. శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ప్రాధాన్యతను భక్తులకు వివరిస్తున్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో, తూంకుంట మున్సిపాల్టీలోని పలు గ్రామాల్లోనూ శ్రీరాముని సేవకులుగా అక్షింతలను పలువురు ఇంటింటా పర్యటించి ప్రజలకు అందజేస్తున్నారు.

## చిరస్మరణీయుడు కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న నాయకులు

**మాడ్గుల, జనవరి 16, ప్రభాతవార్త:**
జాతీయ భావజాలంతో ఉన్నత స్థాయికి ఎదిగిన కల్వకుర్తి మట్టి బిడ్డ, ఉత్తమ పార్లమెంటరీయన్ కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి అని ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కొల్కులపల్లి ఎంపీ టీసీ సభ్యులు బట్టు కిషన్‌రెడ్డిలు అన్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ని జైపాల్‌రెడ్డి స్మృతివనంలో నిర్వహించిన సూదిని జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలకు మాడ్గుల మండలం నుంచి ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి, ఆమన గల్లు మార్కెట్ కమిటీ, మాజీ చైర్మన్ కొల్కులపల్లి ఎంపీటీసీ సభులు కిష న్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డిలతో పాటు పలువురు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు వురు నాయకులు మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యేగా, పార్లమెంట్, రాజ్యస భ సభ్యులుగా పనిచేసి కేంద్రమంత్రి స్థాయి వరకు ఎదిగారన్నారు. ఏ హో దాలో పనిచేసిన ఆ హోదాకు వన్నె తెచ్చిన వ్యక్తిగా కొనియాడారు. దేశ రాజ కీయాల్లో లౌకిక, జాతీయ భావజాల స్ఫూర్తితో వ్యక్తిత్వ రాజకీయాలకంటే నమ్మిన సిద్ధాంతాలు, విలువలు, పునాదులతో కూడిన రాజకీయాలతో ఉన్న త స్థాయికి ఎదిగిన మహోన్నత నాయకుడు జైపాల్‌రెడ్డి అని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా సంక్షేమ పథకాలు, ఎన్నో మార్పులు చేపట్టి, సాంకేతిక పరి జ్ఞానం జోడించి సామాజిక అభివృద్ధికి దోహద పడిన నాయకుడిగా జైపాల్‌రెడ్డి చిరస్మరణీయుడిగా నిలిచిపోతారన్నారు.

## అనంతారం గ్రామానికి మిషన్‌భగీరథ నీరు పంపిణీ లేక ప్రజల ఇబ్బందులు

**-అధికారులకు చెప్పినా స్పందన కరువు : సర్పంచ్ నర్సింహ్మారెడ్డి**

**-నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించండి**

**శామీర్‌పేట, జనవరి 16, ప్రభాతవార్త**
అనంతారం గ్రామానికి మిషన్‌భగీరథ నీరు సరఫరా లేక అనంతారం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడుచింతలపల్లి మండలంలోని అనంతారం గ్రామానికి గత నెల రోజుల నుంచి మిషనర్‌భగీరథ నీరు రావటం లేదని సంబంధిత అధికారులకు తెల్పినా స్పందన లేదని అనంతారం గ్రామ సర్పంచు ఎం.నర్సింహ్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి మిషన్‌భగీరథ నీరు సరఫరా కావటం లేదని గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మిషన్‌భగీరథ అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా పట్టించుకోవటం లేదని గ్రామంలోని బోర్ల మీద ఆధారపడాల్సి వస్తుందని అనంతారంలో నీటి ఎద్దడి ఏర్పడిందని, మిషన్‌భగీరథ త్రాగునీరు సరఫరా కాక ప్రజలు బోరుబావులను ఆశ్రయించాల్సి వస్తుందని, బోర్ల నుంచి ట్యాంకులు నింపాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామ సర్పంచు ఎం.నర్సింహ్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మండల, జిల్లా సంబంధిత మిషన్‌భగీరథ అధికారులు స్పందించి అనంతారంలో నీటి ఎద్దడిని తీర్చాలని, గ్రామానికి మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయాలని పైప్‌లైన్ ద్వారా వెళ్తున్నా గ్రామానికి వదలటం లేదని ఆయన అన్నారు. గ్రామంలో వివిధ వార్డుల ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఇకనైనా మిషన్‌భగీరథ అధికారులు స్పందించి గ్రామానికి మిషన్‌భగీరథ నీరును సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచుతో పాటు గ్రామ ప్రజలు కూడ కోరుతున్నారు.

## దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

**-ఆర్ఎస్ఎస్ తెలంగాణా ప్రాంత ప్రచారక్ రాంప్రసాద్**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ తెలంగాణా ప్రాంత ప్రచారక్ రాంప్రసాద్

**కొడంగల్,జనవరి 16ప్రభాతవార్త**
భిన్నత్వంలో ఏకత్వంగా ఉండే దేశ సంస్రృతి సాంప్రదాయాలను ఆర్ఎస్ఎస్, హిందు వాహిని కార్యకర్తలు కాపాడుకునేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్య వక్త తెలంగాణా ప్రాంత ప్రచారక్ జి,రాంప్రసాద్ సూచించారు.సోమవారం పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) అద్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.అంతకుముందు భారతదేశ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.అనంతరం సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. పూర్వీకులు ప్రతి పండగకు విశేషాలను తెలియజేశారని,కాలానుగుణంగా పండగల ప్రత్యేకత ఉంటుందని,మనమంతా పాటిస్తూ ముందు తరాలకు అందించాల్సి న బాధ్యత ఉంటుందని అన్నారు.ప్రపంచంలోని అనేక దేశాలు మన దేశ సంస్రృతి సాంప్రదాయాలను పాటిస్తున్నాయని అన్నారు.దేశ ఔనత్యాన్ని నిలిపేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని అన్నారు.మన దేశంలో నివసించిన వారంతా దేశంపై ప్రేమ,గౌరవం,అభిమానం కలిగి ఉండాలని అన్నారు.విభిన్న మతాలు,కులాలు,బాషలున్నా భారతీయ సనాతన ధర్మానికి అనుగుణంగా సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు.భారతీయ సంస్రృతి సాంప్రదాయాలను పెంపొందించేందుకు ఇంట్లో నుంచే మొదలు పెడుతు ఐక్యతను చాటేందుకు కృషి చేయాలన్నారు.శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అద్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రాములు వారి పూజిత అక్షింతలను అక్షింతలను ప్రతి ఇంటికి పంచిపెట్టడం,వాటి విశిష్టతను వివరించడం కార్యకర్తలకు ఎంతో అదృష్టమన్నారు.అనంతరం నువ్వుల లడ్డూలను ఒకరికొకరు తినిపించుకున్నారు.కార్యక్రమంలో యోగా గురువు జగన్మయానంద స్వామి,ముఖ్య అతిధి విశ్రాంత ఉపాధ్యాయులు రాధాకృష్ణ,హిందువాహిని,ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులకు పులిహోర అన్న ప్రసాదం పంపిణీ

**-ప్రారంభించిన మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**



పులిహోర ప్రసాద పంపిణీని ప్రారంభించిన మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి,పాల్గొన్న ఎంపిటిసి సభ్యులు ఎస్.అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, నాయకులు ఆల వీరారెడ్డి తదితరులు

**శామీర్‌పేట, జనవరి 16, ప్రభాతవార్త**
శ్రీ క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగ మజీద్‌పూర్ గ్రామం వైపున గుట్ట కింద గ్రామ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పులిహోర అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి విచ్చేసి ప్రారంభించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్ గ్రామం వైపున నుంచి వచ్చె భక్తుల కోసం ఎంపిటిసి సభ్యుడు ఎస్.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పులిహోర అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమం జరిగింది. దీన్ని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఆ తరువాత క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే ఎం,సుధీర్‌రెడ్డి దర్శించుకున్నారు. మజీద్‌పూర్ గ్రామ పరిధిలో గుట్ట కింది వైపున ఉచిత పులిహోర అన్న ప్రసాదం పంపిణీతో పాటు ఉచిత పార్కింగ్ సౌకర్యం కూడ భక్తుల కోసం కల్పించటం జరిగిందన్నారు. దీనిలో ఆయనతో పాటు గ్రామ ఎంపిటిసి సభ్యుడు ఎస్.అశోక్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచు ఎల మల్లేశ్, మండల నాయకులు ఆల వీరారెడ్డి, ఎం.అంజిరెడ్డి, తుంకి మల్లేశ్, తుంకి బిక్షపతి, ఎ.భాస్కర్‌గౌడ్, నర్మద, పలువురు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అయితే ప్రతి ఏటా మకర సంక్రాంతి మరుసటి రోజున జరిగే ఈ జాతరలో మేడ్చల్, శామీర్‌పేట మండలాల నుంచి భక్తులు విచ్చేసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవటం ఆనవాయితీగ వస్తుంది. ఈ జాతరలో జాతర సందర్భంగ మజీద్‌పూర్ గ్రామ భక్తులతో పాటు శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూడ భక్తులు జాతరలో పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు.

## కమనీయం గోదాదేవి కళ్యాణం



కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు, ఎంపిపి సుదర్శన్‌రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్, జనవరి 16, ప్రభాతవార్త:**
ఎదులాబాద్‌లో సోమవారం శ్రీగోదాదేవి కళ్యాణోత్సవం కన్నులపండువలా జరిగింది. సంక్రాతి పర్వదినం రోజు శ్రీఆండాల్ మన్నార్‌రంగనాయకస్వామి ఆలయ ఆవరణలోని మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి కల్యాణం జరిపించారు. ధనుర్మాసం ముగింపు సందర్భంగా శ్రీగోదాదేవి, రంగనాయకస్వామిల ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్ఛారణాల మద ్య కళ్యాణం ఘనంగా జరిగింది. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి-కల్పన దంపతులతో పాటు పలువురు దంపతులు విచ్చేసిస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించుకున్నారు. మండలం నుంచేగాక హైద్రాబాద్‌కు చెందిన భక్తులు విచ్చేసి గోవిందనామ స్మరణతో పాల్గొని కళ్యాణం తిలకించారు. ధర్మకర్తలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణి చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కళ్యాణాన్ని తిలకించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపిపి సుదర్శన్‌రెడ్డిలను ధర్మకర్తలు సత్కరించి ఆశీర్వచనం అందజేశారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించగా భక్తులు సేవలో పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం శ్రీగోదాదేవి (అండాళ్) అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గత నెలరోజులుగా జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు ముగిసాయి. ఈకార్యక్రమంలో ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కాలేరు సురేశ్, మాజీ ఎంపిటిసి మంకం రవి, మండల బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షులు అల్లం శ ంకర్, ఆలయముఖద్వార దాత బట్టె లక్ష్మణ్‌రావు, నాయకులు కాలేరు రా మోజీ, చిర ంజీవి, రాజశేఖర్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.